క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆ పార్టీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా భీమిలిలో పార్టీ విషయాల గురించి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. చిన్న శ్రీనుతో పాటు భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు మాజీ సీఎంను కలిశారు. - తగరపువలస

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం 33/11 కేవీ గిడిజాల సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా గిడిజాల, వేమగొట్టిపాలెం, లక్ష్మీదేవిపేట, ముచ్చర్ల, తంగుడుబిల్లి హౌసింగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రాస పోలమాంబకు విశేష పుష్పాలంకరణ



తగరపువలస: రాసపోలమాంబ అమ్మవారు మంగళవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత అయిన అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు తామర, నందివర్ధనం, కనకాంబరాలతో అలంకరించారు. లక్ష్మీపురం పంచాయతీకి చెందిన డొకర సన్యాసి, గౌరి దంపతులు ఈ అలంకరణకు సహకారం అందించారు. తుపాకుల అప్పలరాసయ్య, రాపమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

2న శంకర జయంతి

పీఎం పాలెం: జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతిని మే 2న ఘనంగా నిర్వహించనున్నట్లు శృంగేరి శంకరమఠం గౌరవ పరిపాలనాధికారి జగర్లమూడి వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులోని శ్రీ శృంగేరీ శంకరమఠంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 8 గంటలకు ప్రత్యేక పంచామృత అభిషేకములు, అర్చనలు, ఉదయం 9 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేష అర్చనలు ఉంటాయన్నారు. 11 గంటలకు పాదుకలకు విశేష పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు రుద్రహోమం, పూర్ణాహుతి, సాయంత్రం 6గంటలకు శంకర విజయం, శంకరాచార్య అష్టోత్తర నామావళి పారాయణం, హారతి కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు.

అష్టలక్ష్మీ ఆలయ వార్షికోత్సవం నేడు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయ 14వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవంతో పాటు అక్షయ తృతీయ నేపథ్యంలో విశేష అర్చనలు ఉంటాయని పేర్కొన్నారు. ఆ రోజు తెల్లవారుజామున 5.30గంటలకు సుప్రభాత సేవ, అర్చనలు, 6.30 గంటలకు విశేష అలంకరణ, 8 గంటలకు శ్రీ విష్వక్సేన పూజ, మండపారాధన, 11.30 గంటలకు శ్రీ లక్ష్మీ నారాయణ హోమం, సాయంత్రం 5.30 గంటలకు గరుడ, శేష వాహన సేవలు, పురవీధుల్లో శోభాయాత్ర, 6.30 గంటలకు శ్రీ లక్ష్మీ నారాయణులకు కల్యాణ మహోత్సవం, రాత్రి 9 గంటలకు ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు చీరలు అందిస్తున్న శ్రీనివాసరావు

మధురవాడ: చంద్రంపాలెం సమీపంలోని ఎన్‌జీజీవోస్ కాలనీలో ఎలోహిమ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పేదలకు చీరలు పంపిణీ చేశారు. కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చంద్రంపాలెం, ఎన్‌జీజీవోస్ కాలనీ పరిసర ప్రాంతాలకు చెందిన 80 మంది మహిళలకు చీరలు అందజేశారు. పి.అమ్మాజీ, కొండమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ నిలయం

బాల సదనం

అనాథలు/ పేదలకు చక్కని అవకాశం

ప్రాథమిక స్థాయి వరకు వసతి, శిక్షణ

మే నెలలో ప్రవేశాలు ప్రారంభం



బొమ్మలు గీస్తున్న చిన్నారులు

అనాథ బాలికలకు చల్లని నీడని స్తున్న వసతి నిలయం బాలసదనం. తల్లిని లేదా తండ్రిని కోల్పోయినా లేదా జీవనం భారంగా మారిన వారైనా తమ ఆడపిల్లలను ఇక్కడ చేర్పించవచ్చు. వారికి రక్షణతో పాటు ప్రాథమిక స్థాయి వరకు చదువును, యోగాలో శిక్షణను కూడా అందిస్తూ చక్కగా తీర్చిదిద్దుతున్నారు. ఉమ్మడి విశాఖలో ఒక్కటి మాత్రమే ఉన్న ఈ సదనంలో మే నెలలో ప్రవేశాలు ప్రారంభం కానున్నాయి.



బాలికల బెడ్ రూంలో మంచాలు

భీమునిపట్నం: భీమిలిలో బాలికల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన బాల సదనం వారికి సంరక్షణను, చక్కని వసతిని కల్పిస్తోంది. ఇక్కడ చిన్న బజారు సమీపంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 1979లో ఈ సదనం ఏర్పాటైంది. దీనికి శాశ్వత భవనం ఉండగా, ఇక్కడ 50 మంది పిల్లల వరకు అవకాశం కల్పిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో గతంలో భీమిలితో పాటు కశింకోట, నర్సీపట్నం, చింతపల్లి, పాడేరు ప్రాంతాల్లో ఈ సదనాలు ఉండేవి. ఇప్పుడు విశాఖ జిల్లాలో భీమిలిలో మాత్రమే ఉంది. ఇందులో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు.

అలాంటి వారికి ప్రాధాన్యం

ఈ సదనంలో చేరాలంటే తల్లిదండ్రులు లేని పిల్లలకు ముందుగా ప్రాధాన్యం ఇస్తారు. ఇంకా, తల్లి గాని తండ్రి గాని లేని వారికి, పేదరికంతో ఉన్నవారి పిల్లలకు అవకాశం కల్పిస్తారు. ఇక్కడ చేర్పించే పిల్లలను దగ్గరలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తారు. వారిని ప్రతిరోజు జాగ్రత్తగా పాఠశాలలకు తీసుకువెళ్లి, తిరిగి ఇక్కడికి తీసుకువస్తారు. ఇక్కడ 5వ తరగతి వరకు విద్యాభ్యాసం పూర్తయిన అనంతరం తల్లి/తండ్రి కావాలనుకుంటే తీసుకువెళ్లవచ్చు. లేదంటే వారికి ఇష్టమైతే కస్తూర్బా గాంధీ విద్యాలయాలకు లేదా బాలికల హాస్టళ్లకు రిఫర్ చేస్తారు.

చక్కని వసతులు..శిక్షణ

ఈ సదనంలో ప్రస్తుతం 37మంది పిల్లలు ఉన్నారు. వీరు ఉండడానికి గదులు, వాటిలో మంచాలు, పరుపులు ఉన్నాయి. మంచినీటి సదుపాయం, తగిన మేరకు మరుగుదొడ్లు, బాత్‌రూంలు ఉన్నాయి. అలాగే డైనింగ్ హాల్, టీవీ ఉన్నాయి. టీవీలో వినోద కార్యక్రమాలను పిల్లల చూపిస్తారు. పిల్లలను ఆటలు ఆడించడం, యోగాలో శిక్షణ ఇప్పించడంతో పాటు చిత్రలేఖనం కూడా నేర్పుతారు. దీనికి ప్రత్యేకించి టీచర్లు ఉన్నారు.



యోగాసనాలు అభ్యాసం చేస్తున్న బాలికలు



బాల సదనం వసతి గృహం

11మంది సిబ్బంది

ఇక్కడ మొత్తం 11మంది మహిళా సిబ్బంది ఉన్నారు. నిర్వహణను సూపరింటెండెంట్ చూస్తారు. పిల్లలకు పాఠాలు చెప్పడానికి ఇద్దరు ట్యూషన్ టీచర్లు, యోగా శిక్షణ, ఆటలు ఆడించడానికి ఒకరు, అల్లికలు, కుట్లు, చిత్రలేఖం నేర్పడానికి ఒకరు ఉన్నారు. అలాగే దీనికి ఒక ఇన్‌చార్జి ఉండగా కుక్, హెల్పర్, అకౌంటెంట్, హౌస్ కీపర్, నైట్ వాచ్‌ఉమన్ ఉన్నారు. వీళ్లందరూ సదనం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

సమస్యలివీ..

- ఇక్కడ పిల్లలకు కంప్యూటర్‌లో శిక్షణ ఇవ్వడానికి అవకాశం ఉన్నా, కంప్యూటర్లు లేవు. దీని కోసం కేటాయించిన గది ఖాళీగా ఉంది.
- ప్రహరీగోడ ఎత్తు తక్కువగా ఉండడంతో ఇబ్బందులు వస్తున్నాయి. మూడు సంవత్సరాల క్రితం కొందరు గోడ దూకి రావడం, రాళ్లు విసరడం వంటి సంఘటనలు జరగడంతో ఆందోళన నెలకొంది. ఇటువంటివి జరగకుండా గోడ ఎత్తు పెంచాల్సి ఉంది.



ఎత్తు తక్కువగా ఉన్న ప్రహరీ గోడ

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రవేశం



ఈ బాల సదనం ఆడపిల్లలకు ఎంతో చక్కని అవకాశాన్ని కల్పిస్తోంది, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రవేశం కల్పిస్తున్నాం. ఇక్కడ వారికి ఎంతో సురక్షితమే కాకుండా చక్కని వసతులు, విద్య, శిక్షణ అందిస్తాం. అయితే, దీని గురించి చాలామందికి తెలియకపోవడంతో ఈ అవకాశాన్ని వినియోగించుకోలేకపోతున్నారు. మే నెల నుంచి ఇందులో ప్రవేశాలు కల్పిస్తున్నాం. అర్హులు తమ పిల్లల్ని ఇందులో చేర్పించి అవకాశాన్ని వినియోగించుకోవాలి. వివరాలకు 79891 42781, 78935 14460 నంబర్లకు సంప్రదించవచ్చు.

-కె.ప్రమీల, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, బాలసదనం

20న కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి



మేడే పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

తగరపువలస: కార్మికుల హక్కులను కాలరాసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, దీనిని నిరసిస్తూ మే 20న తలపెట్టిన అఖిల భారత కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని భీమిలి డివిజన్ సిటు కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి కోరారు. చిట్టివలస సిటు కార్యాలయం వద్ద మంగళవారం మే డే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్ చట్టాలను తీసుకువచ్చి కార్మికులను బానిసలుగా చేయాలని చూస్తోందన్నారు. పరిశ్రమల ప్రైవేటీకరణను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు కె.నాగరాణి, నాయకులు ఎస్.అప్పలనాయుడు, నీలాతి రాము, నమ్మి నాయుడు, పల్ల పెంటరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలువపై కట్టడం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



కాలువపై తొలగిస్తున్న నిర్మాణం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ పరిధి సుభాష్‌నగర్‌లో ఓ వ్యక్తి కాలువను ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నాడు. దీనిపై స్థానికులు సచివాలయానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో మంగళవారం సాక్షి దిన పత్రికలో 'కాలువపైనే కట్టడం' శీర్షికతో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఈ నిర్మాణాన్ని తొలగించారు. దీనిపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

తెలగా సేవాసంఘం ఆర్థిక సాయం



జల్లు రంగా కుటుంబానికి రూ.15వేలు అందిస్తున్న సంఘం ప్రతినిధులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కొత్తపేటలో ఇటీవల మృతి చెందిన జల్లు రంగా పెద్దకర్మ నిమిత్తం తెలగా సేవా సంఘం ప్రతినిధులు ఆయన కుటుంబ సభ్యులకు రూ.15వేల సాయం అందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రంగూరి సీతారామదొర, రంగూరి గిరిధర్, నార్ల వాసు, మేకల రమేష్, మేకల శ్రీనివాసరావు, కె.కొండలరావు, జల్లు తిరుపతిరావు, చింతగుంట శివ తదితరులు పాల్గొన్నారు.

4.43 ఎకరాల భూమి స్వాధీనం



హెచ్చరిక బోర్డు పెడుతున్న రెవెన్యూ అధికారులు

పద్మనాభం: మండలంలోని బుడ్డివలస-అగ్రహారంలో 4.43 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. సర్వే నంబర్ 26/2, 26/5లోని 4.43 ఎకరాల భూమిలో డీపట్టాదారుడు లేకుండా వేరే వ్యక్తులు ఉండడంతో, దీనిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇది ప్రభుత్వ భూమి అని, ఆక్రమణదారులు శిక్షార్హులు అని పేర్కొంటూ రెవెన్యూ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో విశాఖ జోన్-3 ఈఈ కార్యాలయ పరిధిలోని మధురవాడ, పీఎం పాలెం, కొమ్మాది సబ్ స్టేషన్ల పరిధిలో తరచూ అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు సుమారు గంటన్నర పాటు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ పరిసర ప్రాంతాలలో కోత విధించారు. రాత్రి వేళల్లో రెండు నుంచి 3 గంటల పాటు కోత విధిస్తున్నారు. గురువారం రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు వుడా కాలనీ, మధురవాడ పరిసర ప్రాంతాల్లో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అసలే ఎండ, ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలు ఇష్టానుసారం విధిస్తున్న కరెంటు కోతలతో మరింత ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శ్మశానవాటికలో తొలగించని వ్యర్థాలు

- మూడు నెలల క్రితమే తొలగిస్తామన్న అధికారులు
- నేటికీ తీసుకోని చర్యలు



నమ్మివానిపేట డంపింగ్‌యార్డు నుంచి తగరపువలస శ్మశానవాటికకు తరలించిన వ్యర్థాలు



శ్మశానవాటికలో రెండు అడుగుల మేర డంపింగ్‌యార్డు వ్యర్థాలతో నింపేసిన దృశ్యం



మూడు నెలలుగా శ్మశానవాటిక నుంచి తొలగించని వ్యర్థాలు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు తగరపువలస గోస్తని నది తీరాన ఉన్న శ్మశానవాటిక, డంపింగ్‌యార్డులా మార్చేశారు. మూడు నెలల క్రితం రెండోవార్డు నమ్మివానిపేట డంపింగ్‌యార్డు నుంచి తీసుకువచ్చిన వ్యర్థాలతో దీనిని నింపేశారు. డంపింగ్‌యార్డులోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నుంచే బయో మైనింగ్ వ్యర్థాలను తరలించినట్లు అప్పట్లో జీవీఎంసీ అధికారులు కూడా ధ్రువీకరించారు. హిందూ శ్మశానవాటికను బయో మైనింగ్ వ్యర్థాలతో పూడ్చివేయడాన్ని అప్పట్లో హిందువులు పెద్ద ఎత్తున వ్యతిరేకించారు కూడా. వాస్తవానికి డంపింగ్‌యార్డులోని గార్బేజ్ స్టేషన్ వద్ద చెత్తను స్వీడన్‌కు చెందిన బయోమైనింగ్ యంత్రంతో వేరు చేసి, తర్వాత అక్కడి నుంచి మట్టిని బయటకు తరలించాలి. కానీ కాంట్రాక్టర్ యంత్రంతో చెత్తను వేరు చేయకుండానే జీవీఎంసీకి నష్టం కలిగే విధంగా కాపులుప్పాడ వద్ద కొండపైన, తగరపువలస శ్మశానవాటికకు తరలించి చేతులు దులుపుకొంటున్నారని అప్పట్లో ఆరోపణలు వినిపించాయి. రాత్రి వేళ డంపింగ్‌యార్డు నుంచి బయో వ్యర్థాలను తగరపువలస శ్మశానవాటికకు తరలిస్తుండగా పోలీసులు కూడా ప్రశ్నించారు. అప్పట్లో లారీలతో వ్యర్థాలను తరలించినప్పుడు శ్మశానవాటిక ప్రహరీ కూడా దెబ్బతింది. ఆలస్యంగా స్పందించిన జీవీఎంసీ అధికారులు కాంట్రాక్టర్‌తోనే బయో మైనింగ్ వ్యర్థాలను తిరిగి తరలించి శ్మశానవాటికను యథావిధిగా ఉంచుతామని చెప్పారు. ఇది జరిగి మూడు నెలలు గడచిపోయినా వ్యర్థాలు తరలించకపోగా, ఇంకా గుట్టలుగా వదిలేయడంతో శ్మశానవాటికకు వచ్చేవారు ఆందోళనకు గురవుతున్నారు.

'హెచ్చరిక బోర్డులు లేవట'

ఆక్రమణలపై చర్యల్లో అధికారుల ఉదాసీనత

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో ఇటీవల కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. స్థలాన్ని ఆక్రమించి నెలలు గడుస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కాపులుప్పాడ రెవెన్యూ పరదేశిపాలెం సర్వే నెంబరు 60లో 2880 గజాల ప్రభుత్వ స్థలం, మంగమారిపేటలో సర్వే నెంబరు 314లో 3360 గజాలు ప్రభుత్వ స్థలం, కళ్లివానిపాలెంలో సర్వే నెంబరు 149లో రెండు ఎకరాల చెరువు ఆక్రమణకు గురైంది. వీటిపై అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమణదారులకు అధికారులే అండగా ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని నిర్ధారణకు వచ్చినప్పుడు ఆక్రమణదారులపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ఆ స్థలం పరిరక్షణలో భాగంగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంది. కానీ అధికారులు పైప్రాంతాల్లో ఎక్కడా చర్యలు తీసుకోవడం కానీ, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం కానీ లేదు. దీనిపై ఆర్ఐ మల్లేశ్వరరావును వివరణ కోరగా హెచ్చరిక బోర్డులు తమ వద్ద లేవని, తయారు చేయించాలని చెప్పుకొచ్చారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా జనార్ధనరావు



ఎన్నికైన న్యాయవాదుల సంఘం సభ్యులు

భీమునిపట్నం: భీమిలి న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా సీనియర్ న్యాయవాది ఎస్.జనార్ధనరావు గెలుపొందారు. ఎన్నికల అధికారి ఎస్.సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికలు జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా కె.మంజుల, కోశాధికారిగా జి.రామారావు, సంయుక్త కార్యదర్శిగా డి.కనకమహాలక్ష్మి, ఉపాధ్యక్షునిగా డి.సూర్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జి.ప్రశాంతి, బి.అప్పలరాజు ఎన్నికయ్యారు.

ఇన్‌చార్జి పాలనలోనే శిల్పారామం

- మార్చిలోనే బదిలీ అయిన గత పరిపాలనాధికారి
- నెల రోజులు దాటినా విధుల్లో చేరని కొత్త అధికారి
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- నిర్వహణ అంతంత మాత్రమే..



శిల్పారామం ప్రవేశ ద్వారం



పచ్చిక లాన్‌ను పాడు చేస్తున్న పందులు

పీఎం పాలెం: శిల్పారామం నెల రోజులుగా ఇన్‌చార్జి పాలనలోనే నడుస్తోంది. గతంలో ఇక్కడ పని చేసిన విశ్వనాథ రెడ్డి పులివెందులకు బదిలీ కాగా, పుట్టపర్తి శిల్పారామంలో ఏవోగా పని చేస్తున్న రమేష్ రెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు. ఆయన జాయిన్ కాకపోవడంతో విజయనగరం శిల్పారామంలో ఏవోగా చేసిన చేస్తున్న రమణను గత నెల 27న డిప్యుటేషన్‌పై నియమించి, రెండు శిల్పారామాల బాధ్యతలను ఆయనకే అప్పగించారు. అలాగే ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ప్రసాద్ రెడ్డిని అదే నెలలో గుంటూరు శిల్పారామంకు బదిలీ చేశారు. ఆ స్థానంలోనూ మరొకరిని నియమించలేదు. ఉన్న సిబ్బందినే సర్దుబాటు చేసి నెట్టుకువస్తున్నారు. సిబ్బంది కొరతతో శిల్పారామం నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. ఇక్కడ సమస్యలతో సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. క్రికెట్ బ్యాటింగ్ ప్రాక్టీస్ యూనిట్ మూలకు చేరింది. పార్కులో యథేచ్ఛగా సంచరిస్తున్న పందులు పచ్చిక లాన్‌లను ధ్వంసం చేస్తున్నాయి. పందుల సంచారంతో సందర్శకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రాష్ట్ర శిల్పారామాల ఉన్నతాధికారులు స్పందించి, శాశ్వత పరిపాలనాధికారిని నియమించాలని, ఖాళీగా ఉన్న ఇతర పోస్టులనూ భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు. శిల్పారామం అందాలను మెరుగుపరచాలని సందర్శకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి విశేష అర్చనలు



పూజలు అందుకున్న సుబ్రహ్మణ్య స్వామి

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డు పరిధి స్థానిక ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులో ఉన్న శ్రీ శృంగేరీ శంకర మఠంలో కొలువుదీరిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మంగళవారం విశేష అర్చనలు చేశారు. కారుషెడ్ సమీపంలోని బబ్బేలమ్మ ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య స్వామికి కూడా భక్తులు పూజలు చేశారు.

జీరుపేటలో కుక్కల బెడద

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు జీరుపేటలో కుక్కల బెడద వదలించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి కోరారు. రోడ్డు పక్కన తుప్పలు తొలగించారు గానీ, కుక్కల నియంత్రణ కు చర్య లు చేపట్టలేదన్నారు. దీంతో ఈ ప్రాంతంలో ప్రజలు ఇబ్బంది పడుతు న్నారని పేర్కొన్నా రు. పత్రికల్లో వచ్చిన సమస్యలపై మాత్రమే శానిటేషన్ కార్యదర్శులు స్పందిస్తున్నారన్నారు. వాస్తవానికి వారి విధులు వారు సక్రమంగా నిర్వర్తిస్తే ఎలాంటి ఫిర్యాదులు ఉండవన్నారు. జీరుపేట నుంచి చిల్లపేట వరకు రోజూ డ్రైనేజీలను శుభ్రం చేయించడమే కాకుండా మరమ్మతులకు గురైన వాటిని శాశ్వతంగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

పంచముఖ ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



ఆంజనేయస్వామి సన్నిధిలో భక్తులు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయ ఆవరణలోని క్షేత్ర పాలకుడు పంచముఖ ఆంజనేయ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. చైత్ర మాసం శుక్ల పక్షం విదియను పురస్కరించుకుని స్వామివారికి నిత్యపూజలు, పంచామృత, సుగంధ ద్రవ్యాభిషేకాలు నిర్వహించారు. పూలు, వడలు, నిమ్మకాయలు, తులసి మాలలతో స్వామిని అలంకరించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు విశేషంగా హాజరయ్యారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.